క్లుప్తంగా

పక్కీరప్ప తాత ఉత్సవాలు ప్రారంభం



మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో అవధూత పక్కీరప్ప తాత ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, మహా మంగళహారతి కార్యక్రమాలు చేపట్టారు. తమ ఇలవేల్పు పక్కీరప్ప తాత స్వామి వారికి ఆకుపూజ నిర్వహించారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. రాత్రి స్వామి ఉత్సవమూర్తిని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు



స్వామి వారి షంషీర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

మద్దికెర: మద్దికెర గ్రామ శివార్లలో రైల్వే గేట్ వద్ద కొలువైన ఇమాంసాహెబ్ వలి 321వ ఉరుసు మహోత్సవాలలో భాగంగా బుధవారం స్వామి వారి షంషీర్ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన స్వామి వారి షంషీర్‌ను గుర్రంపై కొలువుంచి మేళ తాళాలు, డప్పు వాయిద్యాల మధ్య గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. గ్రామంలో మహిళలు, పెద్దలు, పిల్లలు చక్కెరను చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్వామి వారికి కానుకలను సమర్పించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మవ్వ దేవర



మారెమ్మవ్వకు నైవేద్యం తీసుకెళ్తున్న భక్తులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి గ్రామంలో బుధవారం మారెమ్మవ్వ దేవర ఘనంగా జరిగింది. మహిళలు పూర్ణకుంభాల్లో నైవేద్యం తీసుకొని ఊరేగింపుగా దేవాలయం వరకు వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రతి ఇంటి నుంచి కుంభంతో భక్తులు వెళ్లడంతో ఆలయం ముందు క్యూలైన్ ఏర్పడింది. దేవర మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకావటంతో గ్రామం కిటకిటలాడింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ పోలీసుల అధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

నష్ట పరిహారం పంపిణీ



దుగ్గెన్నకు చెక్కును అందజేస్తున్న ఆదోని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు

ఆస్పరి: మండలంలోని బైలుపత్తికొండకు చెందిన రైతు దుగ్గెన్నకు బుధవారం ఆదోనిలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు రూ.9 వేల నష్టపరిహారం చెక్కును అందజేసినట్లు ఫారెస్టు బీట్ అధికారిణి అనురాధ తెలిపారు. వివరాలు.. పది రోజుల క్రితం బైలుపత్తికొండ కొండల్లో దుగ్గెన్నకు చెందిన మేక చిరుత పులి దాడిలో మరణించింది.పోస్టుమార్టం నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపగా రూ.9 వేలు నష్టపరిహారం మంజూరైంది. ఈ మేరకు బుధవారం దుగ్గెన్నకు చెక్కు అందజేశారు.

7న బండలాగుడు పోటీలు

మద్దికెర: ఎం.అగ్రహారం గ్రామంలో అవధూత పక్కీరప్ప స్వామి రథోత్సవాలలో భాగంగా 7వ తేదీ ఉదయం 8 గంటలకు రాష్ట్రస్థాయి దేశం, కిలారి ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ విజయుడు, గ్రామస్తులు బుధవారం తెలిపారు. విజతలుగా నిలిచిన వృషభాల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలతో పాటు మరిన్ని బహుమతులు అందించనున్నారు. ఆసక్తిగల వారు 6281817744 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ పంపిణీ

వెల్దుర్తి: స్థానిక సచివాలయం-1 పరిధిలోని 13వ వార్డు విద్యానగర్‌కు చెందిన రంగవేణమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ మహమ్మద్ రఫీ బుధవారం కర్నూలులోని ఆసుపత్రికి వెళ్లి వితంతు పింఛన్ అందించి ప్రశంసలు పొందారు. వలంటీర్‌కు లబ్ధిదారురాలు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి

కృష్ణగిరి: మండల పరిధిలోని పోతుగల్లు, కంబాలపాడు, ఎస్‌హెచ్ ఎర్రగుడి, చుంచు ఎర్రగుడి, కృష్ణగిరి గ్రామాల్లో బుధవారం జెడ్పీటీసీ కేతు సుభాషిణి, సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, జయరామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఆయా గ్రామాల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించి 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి సంబంధించిన కిట్లను అందజేశారు. కార్యక్రమం విజయవంతం చేయడంపై దిశానిర్దేశం చేశారు.

విద్యార్థుల జీవితాల్లో నవోదయం

- ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష
- 7,767 మంది విద్యార్థుల దరఖాస్తు



బనవాసి నవోదయ విద్యాలయం,



స్కౌట్స్ అండ్ గైడ్స్‌పై శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

ఎమ్మిగనూరురూరల్: గ్రామీణ ప్రాంత ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తూ ఉన్నత ప్రమాణాలతో కూడిన అధునాతన విద్యనందిస్తున్నాయి జవహర్ నవోదయ విద్యాలయాలు. 1986లో జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి భారత ప్రభుత్వం జవహర్ నవోదయ విద్యాలయాలను ప్రారంభించింది. సామాన్య, మధ్య తరగతి వర్గాల వారికి ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్య నానాటికి దూరమవుతున్న పరిస్థితుల్లో 'నవోదయ'లో కార్పొరేట్‌కు దీటుగా విద్యనందిస్తూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నాయి. ఇక్కడ చదివిన విద్యార్థులు తదనంతర చదువుల్లో కూడ ప్రగతి సాధిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. బనవాసి జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశానికి 7,767 మంది విద్యార్థులు దరఖాస్తు చేయడాన్ని గమనిస్తే పోటీ ఏ విధంగా ఉంటుందో తెలుసుకోవచ్చు.

- నవోదయ విద్యాలయంలో సీటు వచ్చిందంటే చాలు తమ బిడ్డ భవిత బంగారమేనని తల్లిదండ్రులు భావిస్తున్నారు. అంతటి ప్రాధాన్యత సంతరించుకున్న నవోదయ విద్యాలయంలో 2021-2022 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి ప్రవేశ పరీక్ష ప్రకటన విడుదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష ఉంటుంది. బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 80 సీట్లు అందుబాటులో ఉండగా బాలికలకు 30 శాతం సీట్లు, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయిస్తారు. మొత్తం 80 సీట్లలో 75 శాతం అంటే 60 సీట్లను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 20 సీట్లు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయిస్తారు.

అత్యుత్తమ విద్యా ప్రమాణాలు

నవోదయ విద్యాలయంలో సీబీఎస్‌ఈ సిలబస్‌తో కూడిన విద్యను నిపుణులైన అధ్యాపకులు బోధిస్తారు. సువిశాల ప్రాంగణం, ఆహ్లాదకర వాతావరణం, ఒత్తిడి లేని విద్య, విద్యార్థి కేంద్రీకృత అత్యుత్తమ విద్యా బోధన, అధునాతన కంప్యూటర్ ల్యాబ్, పోషక విలువలతో కూడిన ఆహారం, మానసికోల్లాసానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, ఎన్‌సీసీ తదితర అంశాలు ఇక్కడి ప్రత్యేకతలు .అలాగే ఎన్‌సీసీ, నేషనల్ గ్రీన్ కోర్, స్కౌట్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులకు సంగీతం, నృత్యం, చిత్రలేఖనం తదితర అంశాల్లోనూ శిక్షణ అందిస్తున్నారు. సీబీఎస్‌ఈ పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తూ నవోదయాలు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.

విశాల గ్రంథాలయం

బనవాసి నవోదయలో విద్యార్థుల సౌకర్యార్థం సైన్స్, గణితం, సాహిత్యం తదితర అంశాలకు సంబంధించిన 10,300 పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచారు. అలాగే సమకాలీన వార్తాంశాలపై అవగాహన కోసం పలు తెలుగు, ఆంగ్ల ప్రతికలను విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నారు.

అధునాతన కంప్యూటర్ ల్యాబ్

విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో విద్యా బోధన చేసేందుకు శాంసంగ్ స్మార్ట్ క్లాస్ రూం ఏర్పాటు చేశారు. 41 ల్యాప్‌ట్యాప్‌లు, 40 టాబ్లెట్లు విద్యార్థులకు అందుబాటులో ఉంచి వేగవంతమైన అంతర్జాల సౌకర్యం కల్పించారు. డిజిటల్ క్లాస్ రూమ్స్‌లో నిపుణులైన అధ్యాపకులతో విద్యాబోధన అందిస్తున్నారు.

అంతా ఉచితమే

నవోదయ విద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉచితమే. ఆరు నుంచి 12వ తరగతి వరకు అత్యుత్తమ విద్య అందిస్తారు. భోజనం, వసతి, యూనిఫాం, బూట్లు, పుస్తకాలను అందిస్తారు. విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆరోగ్య పర్యవేక్షణ కోసం స్టాఫ్ నర్స్ అందుబాటులో ఉంటారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

అత్యుత్తమ ప్రమాణాలతో విద్యాబోధన



విద్యాలయంలో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తూ పటిష్ట విద్యా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నాం. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మానసిక నిపుణలచే కౌన్సిలింగ్ ఇప్పిస్తాం. వారి ఉజ్వల భవిషత్ కోసం కేరీర్ గైడెన్స్ సెల్ ఏర్పాటు చేశాం. న్యూట్రిషియన్ ఆధ్వర్యంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నాం. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు చాలా మంది ఉన్నత స్థాయిలో ఉన్నారు.

– కె.సాగరిక, ప్రిన్సిపాల్, బనవాసి నవోదయ

పరీక్ష విధానం

నవోదయ ప్రవేశ పరీక్షలో 100 మార్కులకు 80 ప్రశ్నలు ఉంటాయి. సమయం రెండు గంటలు. దివ్యాంగులకు అదనంగా 40 నిమిషాలు సమయం ఇస్తారు.విద్యార్థులుహాల్‌టికెట్లను https://cbseitms.rcil.gov.in/nvs/AdminCard/AdminCard వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

బాధిత రైతుకు ఆర్థిక సాయం

తుగ్గలి: మూడు రోజుల క్రితం పైచింతలకొండలో పశువులపాక దగ్ధమై పశువులు, వ్యవసాయ సామగ్రి కాలిబూడిదై రూ.3 లక్షలకు పైగా నష్టపోయిన గొర్ల రామన్నకు బుధవారం ఆదినారాయణ, మోహన్, సూరన్న, గోవిందు, రామానాయుడు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం బాధిత రైతను ఆదుకోవాలని కోరారు.

భక్తి పారవశ్యం



దవడలకు శూలాలు గుచ్చుకుని వెళ్తున్న భక్తులు

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని కోసిగి రోడ్డులో ఉన్న సుబ్రమణ్యేశ్వర స్వామి రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి అభిషేకం, భస్మపూజ, మంగళహారతులు ఇచ్చారు. స్వామివారి రథోత్సవం సోమప్ప సర్కిల్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి సుబ్రమణ్య స్వామి ఆలయం వరకు కావళ్లతో, సత్యవేళ్లతో ఉరేగింపు నిర్వహించారు. భక్తులు దవడలకు ఇనుప శూలాలు గుచ్చుకొని భక్తిని చాటుకున్నారు. వీపున ఇనుప కొక్కీలు గుచ్చుకొని స్వామి రథాన్ని లాగుతూ ఆలయానికి చేరుకున్నారు. రథోత్సవం సోమప్ప సర్కిల్, గాంధీ సర్కిల్, షరాఫ్‌బజార్, నీలకంఠేశ్వస్వామి దేవాలయం, సోమేశ్వర, శ్రీనివాస సర్కిల్ మీదుగా కొనసాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

'ఆసరా'తో డ్వాక్రా సంఘాలకు అండ





పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం, అధికారులు,హాజరైన మహిళలు

హొళగుంద: పొదుపు మహిళలకు భరోసా కల్పిస్తూ వారి అండగా నిలిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. బుధవారం హొళగుంద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 3వ విడత వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారని చెప్పారు. హొళగుంద మండలంలో ఆసరా మూడో విడత కింద 199 పొదుపు గ్రూపులకు సంబంధించి రూ.64.59 లక్షలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఆసరా, చేయుత లాంటి పథకాలతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న నెరణికికి చెందిన శశిరేఖ, ఫాతిమాబీ, హొళగుందకు చెందిన కలిగర్ ఉమిహప్సాతో పాటు పలువురు మహిళలు తమ అభిప్రాయాన్ని చెప్తూ జగనన్న వల్ల నేడు ఆత్మగౌరవంతో బతుకుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు.

చంద్రబాబు మాటలు నమ్మొద్దు

అధికారం కోసం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పే మాయమాటలు నమ్మవద్దని మంత్రి గుమ్మనూరు జయరాం మహిళలకు సూచించారు. టీడీపీ పాలనలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి దారుణంగా మోసగించారని గుర్తుచేశారు. చంద్రబాబు, జగనన్న పాలనను బేరీజు వేసుకుని ఎవరు మంచి చేసారో ఆలోచించాలన్నారు. మహిళలు, పేదల బతుకులు బాగుపడాలంటే మళ్లీ జగనన్నను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున, నాయకులు ఈశా, చలవాది రంగమ్మ, కోగిలతోట శేషప్ప, నాగప్ప, వెంకటేష్, అయ్యాళప్ప, వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ దాసానాయక్, వెలుగు ఏసీ నవీన్‌కుమార్, ఏపీఎం హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం



జొన్నగిరిలో డ్వాక్రా మహిళలకు ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి/మద్దికెర: మహిళా సాధికారతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. వైకేపీ ఏపీఎం రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 673 డ్వాక్రా సంఘాల్లోని 6,914 పొదుపు మహిళలకు మాఫీ చేసిన రూ.3.81 కోట్ల చెక్కును బుధవారం జొన్నగిరిలో ఆమె అందజేశారు. సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పొదుపు మహిళలతో కలిసి ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో నాలుగేళ్లలోనే 98 శాతం అమలు చేసిన గొప్ప నాయకుడు జగనన్న అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్, రామచంద్రారెడ్డి, పులికొండ నాయక్, ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్దికెరలో వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించి రూ.3.60 కోట్లకు నమూనా చెక్కును ఎమ్మెల్యే శ్రీదేవి లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసరా పథకం మూడో విడతలో భాగంగా మండలంలో 554 గ్రూపులకు చెందిన 6070 మంది మహిళా సభ్యులకు రూ.3.60 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగరాజు, సర్పంచ్ సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన డ్వాక్రా మహిళలు

అధికార దాహంతోనే చంద్రబాబు అబద్ధపు హామీలు

అధికార దాహంతో గతంలో వందలాది హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన ప్రజాద్రోహి చంద్రబాబు అని ఎమ్మెల్యే శ్రీదేవి మండిపడ్డారు. లోకేష్ పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో ఆయనకు, ఆ పార్టీ వారికే తెలియదని ఎద్దేవా చేశారు.

ఆదర్శనీయుడు జగ్జీవన్‌రామ్

స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని, సమాజహితం కోసం ఆయన చేసిన సేవలు మహోన్నతమైనవి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం జొన్నగిరిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అక్కచెల్లెమ్మలకు అండగా జగనన్న





నందవరంలో పొదుపు మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి,థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

నందవరం: మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. బుధవారం నందవరం సచివాలయం-1 ఆవరణలో ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా 3వ విడత సంబరాలు నిర్వహించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో ఆసరా సంబరాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతోందన్నారు. నందవరం మండలంలో 648 పొదుపు గ్రూపుల్లోని 6,410 మంది సభ్యులకు మూడవ విడత కింద రూ. 2,59,70,000 నగదు జమ చేశారన్నారు. మహిళా ఆర్థిక సాధికారతే సాధించినప్పుడే కుటుంబ అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పిల్లల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పోటీ ప్రపంచంలో విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమన్నారు.

చంద్రబాబు మాటలు నమ్మొద్దు

గతంలో డ్రాక్వా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పొదుపు మహిళలను దారుణంగా మోసం చేశారని, మోసపూరిత మాటలను నమ్మొద్దని నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సర్పంచ్ తోట సావిత్రి, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, నాయకులు శివారెడ్డిగౌడ్, లక్ష్మీకాంతరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చాంద్‌బాషా, సోమశంకరరెడ్డి, ఎంపీడీఓ కృష్ణమూర్తి, డీటీ రఘువీర, వైకేపీ క్లస్టర్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, ఏపీఎం చిన్న వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నందవరంలోని బస్టాండ్ వద్ద, గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో చలివేంద్రాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేలా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అలాగే ఎంబీ బియోన్ ప్రార్థన మందిర నిర్మాణాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. చర్చి సంఘ పెద్దలు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సర్వ మతాలను గౌరవిస్తూ ప్రార్థనా మందిరాల నిర్మాణానికి సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

నాడు-నేడు పనుల్లో నాణ్యత తప్పనిసరి

ఎమ్మిగనూరుటౌన్: నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోయాయని, కార్పొరేట్ స్థాయిలో రూపుదిద్దుకున్నాయని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్ఎన్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి పరిశీలించారు. పనులు నాణ్యతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

జగనన్నతోనే భవిష్యత్తు

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరుతున్నాయా? లేదా? అని తెలుసుకునేందుకు ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభించనున్న 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు వారి వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పనితీరును వివరించాలన్నారు. ప్రతి ఇంటికీ జగనన్నే మా భవిష్యత్తు కిట్‌ను అందించి గోడకు స్టిక్కర్లు అంటించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కౌన్సిలర్ డిష్ కేశవరెడ్డి జేసీఎస్ పట్టణ కన్వీనర్లు షబ్బీర్‌అహమ్మద్, బంగిశ్రీరాం, చాంద్‌బాష పాల్గొన్నారు.



జగనన్నే మా భవిష్యత్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, పార్టీ నాయకులు

పోతులింగేశ్వర స్వామి ఉచ్చాయం

హొళగుంద: గజ్జహళ్లిలో వెలసిన పోతులింగేశ్వర స్వామి జాతరను పురస్కరించుకుని బుధవారం ఉచ్చాయోత్సవం ఘనంగా జరిగింది. ఉచ్చాయంలో ప్రతిష్ఠించిన స్వామి విగ్రహానికి పూజారులు మహామంగళారతి, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి ఉచ్చాయాన్ని లాగారు. జాతరలో భాగంగా రథోత్సవానికి ముందు రోజు ఉచ్చాయం, పల్లకి సేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం సాయంత్రం రథోత్సవం జరగనుంది. 7న లంకాదహనం, 8న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి.



గజ్జహళ్లిలో ఉచ్చాయాన్ని లాగుతున్న భక్తులు

నేడు ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభం

ఆలూరు: దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు బుధవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, వైద్యాధికారులు, హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ప్రజల గుండెచప్పుడు జగనన్న

పత్తికొండటౌన్: ప్రజల గుండెచప్పుడు జగనన్న అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం సాయంత్రం పత్తికొండలో పార్టీ నాయకులతో సమావేశమై ఈనెల 7 నుంచి ప్రారంభం కానున్న 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం విజయవంతం చేయడంపై దిశానిర్దేశం చేశారు. పార్టీ నాయకులతో కలసి పోస్టర్లు విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 20వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడా, 45 నెలల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హనుమ జయంతి ప్రశాంతంగా జరుపుకోండి

హొళగుంద: మండల కేంద్రంలో గురువారం జరిగే హనుమాన్ జయంతిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సెబ్ ఏఎస్పీ కృష్ణకాంత్ పటేల్ సూచించారు. బుధవారం ఆయన ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఎస్పీ వినోద్‌కుమార్‌తో కలిసి హొళగుందలో పర్యటించారు. స్థానిక పెద్ద మసీదు, బస్టాండు తదితర ప్రాంతాలను పరిశీలించిన ఏఎస్పీ కిందిస్థాయి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. అలాగే మసీదులో ముస్లింలతో మాట్లాడారు. ప్రజలకు హనుమాన్ జయంతి, రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. ఆలూరు సీఐ ఈశ్వరయ్య, ఎస్ఐలు అబ్దుల్ జబీర్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



హొళగుందలో మాట్లాడుతున్న ఏఎస్పీ కృష్ణకాంత్ పటేల్, ఆదోని సబ్ కలెక్టర్

జగ్జీవన్‌రామ్‌కు నివాళి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్‌డీఓ మోహన్‌దాసు, సిబ్బంది

పత్తికొండటౌన్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని ఆర్‌డీఓ మోహన్‌దాస్ అన్నారు. బుధవారం దివంగత మాజీ ఉప ప్రధాని, భారతరత్న బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలు నియోజకవర్గం వ్యాప్తంగా నిర్వహించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్‌డీఓ మోహన్‌దాస్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళితుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. అలాగే వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి శ్రీరంగడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌కృష్ణ, ఎంపీటీసీ నెట్టేకల్లు తదితరులు నివాళులర్పించారు.



ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నివాసంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి వైఎస్ఆర్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్‌అహమ్మద్, తదితరులు నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

సర్పంచ్‌పై దాడి

ఆలూరు: కురుకుంద గ్రామంలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్ దేవిరెడ్డిపై గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారులు రఘురామి రెడ్డి, వెంకటరామి రెడ్డి, పులికేశ రెడ్డి మరికొందరు మంగళవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. ఘటనపై బుధవారం సర్పంచ్ మాట్లాడుతూ.. వ్యక్తిగత, రాజకీయ కక్షతోనే తనపై దాడికి పాల్పడినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.